# పూలబజారు

స్త్రీలకు పూలపై ఉండే మోజుని మాటల్లో చెప్పడం కష్టం. చిన్నా పెద్ద వయోభేధం లేకుండా ఆడ వాళ్ళంతా పూలు పెట్టుకోవడానికి మనసు పడతారు. జడ తేలుకొండి అంతవున్నా దానికో దండను వేలాడ కడితేగాని వూరుకోదు మా చంటి. మొన్నీ మధ్య పూలజడ వెయ్యమని గోలపెట్టింది దానికి జడలేదు. ఇంక ఏడుపు భరించలేక నల్లరిబ్బనలతో కట్టి దానిమీద అట్టతో మల్లెపూలు కుట్టి జడ తయారుచేసేసరికి పొద్దు పోయింది. అది ప్రక్కన పెట్టుకుని నిద్రపోయాక తెల్లారి నల్లగా వాడిపోయిన ఆ జడనే పిన్నీసులతో, దారాలతో వెనక వేళ్ళాడేసుకుని తిరిగింది. అది అంతే దానికి పూలపిచ్చి. కొనకపోతే వాళ్ళూ వీళ్ళూ పారేసిన దండల్ని ఏరు కొచ్చినా చేత దెబ్బలు తింటుంది.

కొనరాదా ఓ పది పైసలు పారేసి, దానికింత రాద్ధాంత మెందుకు అంటారు. వాళ్ళని వెనకేసుకొస్తూ తండ్రి. కొంటాం, కొనకుండా ఎలా ఎలా వెళ్తాయి రోజులు.పీకి పిండెట్టేసెయ్యదూ-కాని పది పైసలవి కొన్నా పది రూపాయలిచ్చి కొన్నా ఆ పూలన్నీ నావే నంటుంది - ఉంకోర్ని ముట్టుకోనియ్యదు. ఇవతలకి లాగి దాన్ని నాలుగేసి అందరికి కట్టితు స్తే— వాళ్ళ తలల్లోని వెనక నుంచి పీకేస్తుంది. ఈ అల్లరీ ఆగమూ భరించలేక పూలు వద్దు పూలతో ఈ పేచీలు వొద్దు అని నోరుమూసుకున్నా.నేనైనా సరే అది చూడకుండా తల్లో పెట్టెకుని ఏ పని చేస్తున్నా చేయి వెనకే

నెత్తిమీదే వుంచుకోవాలి. లేకపోతే మెరుపువాడిలా ఎట్నుంచి వొస్తుందో వచ్చి పీకేసి తుంపులు తుంపులుగా చేసి దెబ్బలు తింటుంది. పిల్లల కది సహజం—ఏం సహజంమంటే—పిల్లలుట్టాక అందులో ఆడ పిల్లల తల్లుల సరదాలన్నీ గంగలో కలిసినట్లే—అనకూడదుగాని ఓ మంచి బట్ట కట్టుకుంటే చూళ్ళేరు. పూల సంగతి సరేసరి. ఆఖరికి అందరికీ పీకలదాకా మెక్కి బెట్టాక మిగిలింది అడుగో బొడుగో కాస్త నోట్లో వేసుకుందామని కూర్చున్నా చేతుల్లోంచి లాక్కుపోతారు. తల్లితో ప్రతీవానికీ పోటీ వస్తారు. ఆడపిల్లలు వాళ్ళ పరికిణీలు ఓణిలు జాకెట్ల కర్చుకు మనకు



రెండు మూడు కట్టుకు చీరలొస్తాయి. వాళ్ళకి జ్ఞానం వచ్చేసరికి తల్లిమీద ప్రేమలూ అభిమానాలూ పుట్టుకొచ్చే సరికి మనవీ లోకంలో వుంటామో, వుండమో... ఎవ్వారికెవ్వారలో...అంచేత ఈ సంసారమంతా మాయ-ఇందులో చిన్నా పెద్దా అని తేడాలేదు —ఎవరి స్వార్థం, ఎవరి గొడవ వారిది-ఆఖరికి నిల్చున్న వాళ్ళు నిల్చున్నట్లు ఏవరో శాపం పెట్టినట్లు మాడిపోయేది కన్న తల్లి తండ్రులే-పండుటాకులా రాలక తప్పదు కదా!

పూల పేచీలతో ప్రారంభించి కట్టెల ఫిలాసఫీ వరకూ వెళ్ళాం అనవసరంగా, పూల వ్యాపారం మంచిదా. కట్టెల వ్యాపారం మంచిదా అని ఎవర్నైనా అడగండి? టక్కున చెప్పేస్తారు కట్టెల వ్యాపారం పెద్దది, లాభసాటి వ్యాపారమని, పూవులమ్మే వాళ్ళు నైసుగా షోగ్గా గీతాంజలి, రమాప్రభ, జ్యోతిర్లక్ష్మిల్లా వుంటారనుకు రోజులు వెళ్ళిపోయాయి. ఇప్పుడు పూవులమ్మే వాళ్ళు బీడీలు కాలుస్తూ బ్రాకెట్ల గురించీ సినిమాల గురించీ జీవితం గురించీ లోకాభిరామాయణాలు చెప్పుకొంటూ అమ్ముతారు. వాళ్ల చేతుల్లెక్కైనా అమ్ముతారు, తూచీ అమ్ముతారు. దండలు కట్టి మూరల్లెక్కైనా యిస్తాడు. ఈ మూరల్తో చాలా తగూ వుంది. మనం పిల్లను పంపిస్తే రెండు పది పైసలు తీసుకుని దానిమూరతో కొలిచి యిస్తాడు మనం వెళ్ళి పెద్దవాళ్ళం మన మూరతో కొలిస్తే 'అలా పనికి రాదండీ' అని డబాయిస్తాడు.

పూల వ్యాపారం ఎంత ఘుమ ఘుమలాడే వ్యాపారమైనా చిల్లర బేరాలకన్న పది పైసలా పావలాలా ఐదు పైసలే—ఇందులో మళ్ళీ ఓల్ సెల్లర్లూ. కమీషనే ఏజంట్లూ, రిటైలర్లూ వుంటారు. ఒకసారి ఓ ముసలావిడ మూడు సంపెగ పూల్ని పట్టుకొని కొనమని మావారిని ఆశీర్వదిస్తూ అడిగిందట, పావలా యిచ్చి తీసుకున్నారు. ఆవిడ పెద్దది. ఏదన్నా తినాలనున్నప్పుడు పెరట్లోని సంపెంగ పూలు కోసి బజారులో కెళ్ళి ఎవర్నో ఒకర్ని కొనమని వాళ్లిచ్చిన డబ్బులెట్టి అరిటి పండో, ఇడ్లీ ముక్కో, ద్రాక్షపళ్ళో కొనుక్కు తింటుందట. ముసలావిడ కదా పెద్దదని ఎవరో ఒకరు కనికరించి ఎంతోకొంత యిచ్చి ఆ పూలు తీసుకుంటారు. ఆవిడకు కోపం కూడా హెచ్చు-ఎంత సేపిలా నుంచోడం—ఎవరూ కొనరే మర్రా మీమొహం మండా" అని తిట్టుకుంటూ మరో బజారుకు కెళ్ళిపోతుందట ఈవిడ పుష్పలావిక అనగలమా-అనలేం-అనలేం. మాచిన్నప్పుడు పచ్చ గన్నేరు పూలు ఏరి గుచ్చి మెళ్ళో వేసుకునే వాళ్లం, ఎర్ర గన్నేరు, మంచార, గంటల మాలతి. నందివర్ధనం, పారిజాతాలంటే నాకెక్కువిష్టం. పొగడచెట్టు కాని పెరట్లో వుంటే తెల్లారి లేచేసరికి నేలంతారాలిన పూలతో కోరుకున్న జీవితం నింపాపిండిన కలలు పరుచుకున్నట్లు లక్ష్మీ గా వుంటుంది.

మందార పువ్వుకి పచ్చని తొడిమ వుంటుంది. అది తీసేసి నోట్లో పెట్టుకుని పీలిస్తే తియ్యగా వుంటుంది. బంతి పువ్వు రేకులు తీసి బొడిపె తింటే రుచిగా వుంటుంది. మందార పూలు, బంతిపూలు కొండవాళ్ళు పెట్టుకుంటారు. తెలుగువాళ్ళు 'ముద్దబంతి పూవు' అని లిటరరీగా మెచ్చుకోవటమే కాని బంతి పూలు పెట్టుకోరు. పిల్లలు అన్నీ పెట్టుకుంటారనుకోండి. చెరువులున్న వూళ్ళల్లో పుట్టి పెరిగిన వారికి ఎర్రకలువలూ, తెల్ల కలువలూ, పద్మాలు వాటిని సేకరించటంలోని సొగసులూ తెలుస్తాయి. అయ్యో యిప్పుడు పూలతోటలు పీకేశారని అనేవాళ్లు కూడా వున్నారు. పూలకోసం బెంగెట్టుకునే వాళ్ళు వున్నారు.

పూర్వం కావ్యాల్లో పురవర్ణనల్లో పుష్పలావికల్ని వర్ణించడం మన కవుల హాబీ.కాని ప్రస్తుత పరిస్థితుల్ని చూస్తూంటే పూల అంగళ్లలో అలాటి పుష్పలావికలూ లేరు. అలాటి సరస వినోద శృంగార సంభాషణాలూ లేవు. కూరల వ్యాపారం, పూల వ్యాపారం. వక్కపొడి వ్యాపారాల లాగ పుష్ప విక్రయం చిన్నసైజు టాలాటోలీ వ్యాపారంగా మిగిలిపోయింది. అయితే పూలమీద మోజు ఎంతకాలం మారినా తరగలేదు, తరగబోదు. క్యాబేజీ పూలూ గోబీపూలూ బీరపూలూ కూడా తల్లో పెట్టుకోవాలని సరదా పడుతుంది. మా అమ్మాయి. పూలపిచ్చి ఎంత చెప్పినా అర్థం కానిది. పూలని మనం నిరాదరిస్తే చిరునవ్వుల్ని జీవితంలోంచి నిషేధించినట్లే—